# కొ వొత్తి

బిడ్డలు గర్భ శత్రువులు. కానీ తల్లిదండ్రులకు వాళ్ళు ప్రియ సంపదలు.

—జయప్రద

"శ్వేతా! నా చిట్టితల్లీ. అమ్మ ఫ్రాక్ కొనివ్వనన్నదా? నేను కొనిస్తాగా, ఏడవకమ్మా నా శ్వేతవు కదూ!"

బాల్యంలోకి జారిపోయిన ఊహల నరాల్ని బలవంతంగా తెంపుకుని కళ్ళు తుడుచుకుని తలెత్తి చూసింది శ్వేత.

ఎదురుగా తండ్రి. కానీ అలా బుజ్జగించే ఆనాటి తండ్రికాదు. తనూ ఏడేళ్ళ శ్వేతా కాదు.

తనిప్పుడు పదహారేళ్ళ కూతురికి తల్లి. కన్నీళ్ళు తుడుచుకుంటూనే వుంది. అయినా ఇంకా బుగ్గలు తడి అవుతూనే వున్నాయి.

చిన్ననాటి రోజులు, ఆనాటి తండ్రి, చేజారిపోయిన తీపి గతం గుర్తువచ్చి కన్నీరు ధారాపాత మవుతూనే వుంది.

"తల్లీ శ్వేతా! ఏడవకమ్మా"

ఆశగా, ఆశ్చర్యంగా చూసింది తండ్రివైపు శ్వేత.

బంగారు బాల్యంలోలా కన్నీళ్ళు తుడుచుకుని పరిగెత్తి తండ్రి ఒళ్లో వాలడానికి ఆమె శరీరం సాహసించలేక పోయింది.

ఆమె మనసు మాత్రం ఆశ పడింది. కానీ, ఆమెను అనంతమైన నైరాశ్యంలో ముంచుతూ ఎదురుగా కదలని అతని పెదాలు.

తన భ్రమగానీ ఆనాటి తండ్రి గనకనా!

ఆనాడు, ఆ నాడయితే ఈజీచెయిర్‌లో పడుకుని 'చిట్టితల్లీ ఏడవకమ్మా' అనగానే కళ్ళు తుడుచుకుని పరుగెత్తి ఆయన ఒళ్లో వాలకపోతే మొండికేస్తే ఇంత సేపు ఆగేవాడా ?

తన కన్నీళ్ళు చూడగలిగేవాడా?

మరు నిమిషంలో 'రావమ్మా శ్వేతా,' అని తనేవచ్చి ఒళ్ళోకి లాక్కొనేవాడు.

ఆ రోజులు తిరిగొస్తే ఎంత బాగుణ్ను! తన ముప్పైఏళ్ళ జీవితం అంటే అంత చిన్నదా ?

అందులో అనుభవాలు ఎన్నని! కొన్ని తీపివి, కొన్ని చేదువి, కొన్ని అందమైనవి, కొన్ని బరువైనవి.

ఒకవేళ ఏదయినా అద్భుతం జరిగి తన ముప్పైఏళ్ళ జీవితమూ వెనక్కు జరిగితే....ఆ రోజుని, ఆ జీవితాన్ని నిలబెట్టుకునే శక్తివుంటే-

'ఓ సృష్టి! నన్నిక్కడ ఆపేసేయ్. అందరిలా ఓ భర్తకు భార్యలా, ఓ బిడ్డకు తల్లిగా బ్రతకాలనే కోరిక నాకులేదు.

కేవలం నా తండ్రికి ముద్దుబిడ్డగా నన్ను మిగిలిపోనీ' అని కోరుకునేదేమో!

"మైనపు ముద్దలాటి నా తండ్రిని ఓ బండరాయిలా చూడగలిగే శక్తి నాకులేదు."

"నా కన్నీళ్ళు తుడవలేని నా తండ్రి చేతుల్ని నేను ఊహించ లేను. ఆయన్ని నాకు మిగిలిపోనీ" అని అర్థించిందేమో!

చటుక్కున తల్లి గుర్తుకొచ్చింది శ్వేతకు.

అమ్మే బతికుంటే?.... శ్వేత కళ్ళల్లో మరిన్ని కన్నీళ్ళు.

ఎందుకీ కన్నీళ్ళు? ఎందుకు ఎందుకిలా పొంగివస్తున్నాయి జల పాతంలా, వరదలా, ఉప్పెనలా!

అమ్మ.... అమ్మకూ, తనకూ మధ్య బాంధవ్యం ఆమె అమ్మ, తను బిడ్డ అంతే! అంతే!

కానీ అల్లంత దూరాన కుర్చీలో ముడుచుకుని కూర్చున్న ఈ నాటి ఆ గాజుకళ్ళ తండ్రి, స్పందించని గుండెతో శిలలా కూర్చున్న ఈ తండ్రి ఆనాడు తనకు కేవలం తండ్రేకాదు—

హితుడు, స్నేహితుడు, తన కన్నీళ్ళు చూడలేని ఆర్ద్రహృద యుడు అన్నీ.

"నాన్నా! నాన్నా! ఏమయింది నీకు? నీ నాడీమండలానికేమైంది? నీ చిట్టితల్లిని నాన్నా నేను. నీ మొదటిబిడ్డను నాన్నా నేను. నీ శ్వేత తల్లిని నాన్నా!"

గట్టిగా ఈ ఇల్లు ప్రతిధ్వనించేలా, కప్పు ఎగిరిపోయేలా తండ్రి గుండె తెరుచుకునేలా, ఆయనలో ముద్ద కట్టుకున్న చైతన్యం కరిగి ప్రవహించేలా అరవాలనుకుంది.

కానీ తన తండ్రి దగ్గర అతి సులువుగా ఆడి అల్లరి చేసిన పెదాలు తనెంత ప్రయత్నించినా ఎందుకిలా మొండికేస్తున్నాయి? అవెం దుకు విడివడడంలేదు.

'నాన్నా నాకు పెన్ కావాలి'
'నాన్నా నాకు పట్టు పరికిణీ కావాలి'
'నాన్నా నేను కాలేజీలో చేర్తాను'
"నాన్నా, నే నతన్నే పెళ్ళి చేసుకుంటాను'

'నాన్నా, ఆయనకు స్కూటర్ కావాలట' అని ఎంత ఈజీగా, ఎంత నిర్భయంగా, ఎంత స్వతంత్రంగా....ఎన్నని? ఎన్ని కోరికలని! వాటి కంతుంటేనా?

అమ్మ ఎప్పటికప్పుడే కాదంటున్నా, ఎక్కడ అప్పులు చేసే వాడో, ఎలా సమకూర్చేవాడో! తన కోరికలు తీరినప్పుడు ఎంత గర్వం నాన్నను కౌగలించుకుని ముద్దు పెట్టుకునేది.

ఆయన పెదాలమీదే ముద్దు పెట్టుకునేది. తన పదిహేనోఏట కూడా ఎంత ప్రీతిగా, ఎంత అతిశయంగా, ఎంత స్వతంత్రంగా.... అలాటి తండ్రికీ, తనకూ మధ్య ఎందుకి నిశ్శబ్ద వాతావరణం? ఏవిటీ గుండెలు గొంతులో అడ్డుపడ్డ అనుభూతి?

ఈ పెదాల్ని కదపాలంటే కొన్ని కోట్ల టన్నుల శక్తి కావా లన్నంత నిర్వీర్యత. దీన్నే మంటారు? ఇదెంత బాధాకరం.

"నాన్నా! నాన్నా! నోరు తెరువునాన్నా! చిట్టితల్లీ నా శ్వేతా అని నా గుండెల్లోని బాధ చల్లార్చు నాన్నా!

గుండె కవాటాల్లో గురగుర లాడుతూ పైకి రావడానికి మార్గం లేక ప్రసవవేదన పడుతున్న పిలుపు ఆమె నరాల్లో.

ధమనుల్లో ప్రవహించే రక్తంలో ప్రతిధ్వనిస్తోంది.

ఆరోజు ఆరోజు పదిహేడేళ్ళ క్రితం కట్నం చాలక ఈయనతో తన పెళ్ళి కాదేమోనని తను దీనంగా కూర్చున్నరోజు.

ఆ రోజు తన కళ్ళల్లో కన్నీళ్ళు కూడా లేవు.

ఆరోజు తన తండ్రికి కాళ్ళూ, చేతులు ఆడాయా?

తల తప్ప తాకట్టు పెట్టడానికేమీ మిగలని రోజుల్లో ఏంచేశాడో, ఎవరి కాళ్ళు పట్టుకున్నాడో, మరో నెల రోజుల్లో ఆయన పక్కనే పెళ్ళి పీటలమీద నును సిగ్గుతో తను కూర్చుని తల ఎత్తితే తండ్రి కళ్ళల్లో కోటికాంతుల పువ్వుల వికసింపులు.

"ఏమైంది నాన్నా నీ ప్రేమ? నీ కారుణ్యం, నీ స్నేహశీలత్వం ఏమయ్యాయి?

నేను విన్నది, హాస్యానికి నన్ను ఉడికించడానికి అన్నదికదూ! నీ ఈ మౌనం, ఈ స్తబ్దత, కాఠిన్యం అబద్ధంకదూ నాన్నా? అబద్ధం అని చెప్పు నాన్నా?"

కన్నీటికట్ట తెగిపోయింది.

కన్నీటిగ్రంధులు కలుజులు వాలిపోయాయి.

ముప్ఫయ్ నాలుగేళ్ళ శ్వేత తెల్లటి చెంపలు నీటిమయం అయిపో యాయి.

"శ్వేతా ఏడవకమ్మా!"

తృళ్ళిపడ్డట్టు చూసింది శ్వేత.

బావిలో మునిగిపోతున్నవేళ తెలిసిన మనిషి స్వరం విన్నట్టు, చేతికేదో తగిలినట్టు, ఆశగా, ఆత్రంగా తలమీదపడ్డ చేతిని గట్టిగా పట్టు కుంది.

"పాపా కళ్ళు తుడుచుకో"

"నువ్వా-నువ్వా తాతయ్యా?"

ఆ కంఠంలో నిరాశ. చిక్కటి కచీటిలాంటి నిరాశ.

అ కళ్ళల్లో కాటుకలాంటి దైన్యం.

ఆ ఎనభై యేళ్ళ వృద్ధుడి మనసు కలుక్కుమంది.

'నువ్వా తాతయ్యా' అన్న మనుమరాలి గుండెల్లోని కొండంత నిరాశ అర్థమైందతనికి.

ఆమె కోరుకున్న ఓదార్పు తన చేతుల్లో లేదు అని అతనికి తెలుసు.

కానీ ఏం చేయగలడు?

పార్థు తన బిడ్డే కావచ్చు.

తన చేతుల్లో పెరిగినవాడే కావచ్చు.

తన కొద్దిపాటి సంపదకూ వారసుడే కావచ్చు.

కానీ వాడు ఎదిగిన బిడ్డ.

ఎదిగిన బిడ్డలకు తండ్రి.

ఆ వృద్ధుడికి పంథొమ్మిదివందలా యాభయ్‌రెండు డిశంబర్ మాసంలో శ్వేత పుట్టినరోజు గుర్తొచ్చింది.

ఈరోజు తండ్రి ఎదురుగా కన్నీళ్ళు పెట్టుకుంటూ కూర్చున్న ఈ పిల్ల ఆరోజు ఓ మాంసపు ముద్ద.

తన కోడలు పెళ్ళయిన ఆరేళ్ళ తర్వాత తొలిసారి ప్రసవవేదన పడి ఈ భూమ్మీద వేసిన క్షణంలో ఈరోజు శిలలా కూర్చోనున్న తన కొడుకు కాలిన పిల్లిలా తిరుగుతున్న వాడల్లా ఆగి తన భార్య ఎలా ఉందని అడగలేదు.

"నాన్నా!" అని తనవేపు తిరిగి ఏదో అడగబోయి సిగ్గుపడి మూలగా వెళ్ళి ఆయా చేతిలో ఎంత పెట్టాడో, కొన్ని నిమిషాలక్రితం ఈ భూమ్మీదపడి ఊపిరి పీల్చుకున్న చంటిబిడ్డను ప్రేమగా చూసుకున్నాడు.

"బాలు లోపలికి తీసుకెళ్ళు చలిగాలి తగుల్తుంది"

తనకు వినబడుతుందని గుసగుసగా అంటుంటే విని నవ్వుకున్నాడు.

'తండ్రి అయిన ప్రతి మనిషి గుండె అలాగే స్పందిస్తుందిఓరా వెర్రినాన్నా' అని నవ్వుకొన్నాడు.

ఆ పిల్ల గోళ్ళు కాస్త బులుగ్గా ఉన్నాయని ఏమి తపన పడిపోయాడనీ?

ఈ పిల్ల తప్పటడుగులు వేస్తూ కాళ్ళలో చాలినంత శక్తి ఇంకా సంతరించుకోని వయసులో చతికిలబడితే తన చిన్నారి కూతురి శరీరంలో ఏ భాగం విరిగిపోయిందో అన్నంత తపన పడిపోయేవాడు.

కూతురు మొదట పబ్లిక్ పరీక్ష రాసే రోజుల్లో వీడుగానీ పరీక్షలు రాయడంలేదు కదా అని ఆశ్చర్యపోయేవాడు తను.

శ్వేత మొదటిసారిగా ప్రసవవేదన పడేప్పుడు వీణ్ని చూసి ఎంత కోపం వచ్చిందనీ తనకి?

ప్రపంచంలో వీడి కూతురు కొక్కదానికే వచ్చిన బాధా ఇది అని!

ఈ శ్వేత కూతుర్ని తండ్రికందించినపుడు వాడు సహజంగా అందరిలా మనుమరాలివేపు చూసుకోలేదు.

"తల్లీ శ్వేతా! ఇక నీకు పిల్లలొద్దమ్మా ఆపరేషన్ చేయించుకోరా" అన్నాడు

ప్రసూతి వైరాగ్యం!

శ్వేతమాత్రం అలా అనుకోలేదు.

"కొడుకు లేకపోతే ఎలా నాన్నా?" అంది.

చప్పున మారిపోయాడు వాడు.

ఈరోజు బలవంతంచేసి ఆపరేషన్ చేస్తే ఆ తర్వాత కొడుకు లేనందుకు తన శ్వేత తల్లి బాధపడితే వాడు భరించగలడా?

అందుకే తన కోరికను తనలోనే సమాధి చేసుకున్నాడు పిచ్చి నాన్న.

అలాటి పిచ్చితండ్రి ఈరోజు ఎందుకిలా మొండికేస్తున్నాడు?

వాటన్నిటికీ మించిన బాధనెందుకు ఆమెకు తనై తాను అందిస్తున్నాడు?

"మామయ్యా! పాప"

తను పురిటి మంచం దగ్గరకు వెళ్ళి వెళ్ళగానే అవి మాతృత్వపు తొలిగర్వంలో తనవేపు ఆనాడు చూసిన కోడలు ఈరోజే బ్రతికుంటే ఈ పిచ్చితల్లికి ఎంత అండగా వుండేది?

చనిపోయిన తన తల్లిలాటి కోడిల్ని తలుచుకున్న ఆ వృద్ధుడి కళ్ళలో చెమ్మ.

ఎప్పటికప్పుడే కూతురి కోరికలు ఖండిస్తూ తాహతుకి మించిన భర్త పనుల్ని గర్హించినా ఆమె తల్లి, తల్లి బిడ్డకు పెద్ద ఆస్థి.

కష్టాలలో, కన్నీళ్ళలో ఆదుకునేది డబ్బుకాదు తల్లీ! ఆ తల్లి ఈ రోజు లేదు.

'మామయ్యా మీరయినా ఈయనకు చెప్పకపోతే ఎలా?' అన్న ఆనాటి కోడలు ఈరోజు ఈ భూమ్మీద లేదు.

నుసై, మసై మట్టయి ఎన్నాళ్ళయిందో కానీ ఆమె గుర్తులు జ్ఞాపకాల పొరల్ని ఇంకా ఛేధిస్తూ, బాధిస్తూ, సజీవంగా, చిరంజీవిగా—

ఇంటి ఖర్చులలో పైసా పైసా పొదుపుచేసి అయిదువేలు సంపాయించి తన చేతిలో పెట్టింది పిచ్చమ్మ ఆరోజు.

'మామయ్యా, ప్రసూన పేదరికంలో వుంది. శ్వేత తనకు కావలసినవి వాళ్ళ నాన్ననడిగి సంపాయించుకోగలదు. ఆ డబ్బు ప్రసూనకి చేర్చండి" అని కన్ను మూసేసింది.

"ఆమె ఆత్మకే జీవముంటే ఈరోజు రోధిస్తుంది కాబోలు. ఆ డబ్బు శ్వేతకిస్తే ఎంత బాగుండేది' అని.

ప్రసూన ఆర్థికంగా ఇప్పుడు బాగుంది.

చిరు ఆశతో నిన్న అడిగాడు ప్రసూనను.

"ఇదమ్మా పరిస్థితి. మీ అమ్మ నీకిచ్చిన అయిదువేలూ మీ అక్క కు సర్దితే...."

ప్రసూన మాట్లాడలేదు.

మౌనంగా మిగిలిపోయింది.

తను తిరిగి వచ్చేవరకు జవాబు చెప్పనేలేదు.

తను మళ్ళీ అడగలేదు.

మరొక్కసారి నోరు తెరిచి అడగటానికి ఆమెకు అర్థంకాకపోతే కదా....!

"అమ్మా! అల్లుడుగార్ని ఒప్పించు" అని భాష మార్చి అదే భావాన్ని అందజేయడానికి. అసలామెకే ఇష్టం లేనట్టుంది. తన తోడ బుట్టిన అక్కకు చేయూత నివ్వడానికి. అంతకుమించి తనేం చేయ గలడు?

తనని కన్నందుకు ఫలితంగా తన పెద్దకొడుకు తిండిపెట్టి, ప్రత్యేకంగా పొగాకు చుట్టకు పావలా అన్నా ఇస్తున్నాడు.

మిగతా కొడుకులు అదీలేదు.

ఎవరినయినా వెళ్ళి 'నేను నీ తండ్రినిరా నాన్నా' అని గుర్తుచేసి 'నేను నిన్ను పెంచానురా' అని చెప్పుకుని, 'నన్ను కళ్ళల్లో పెట్టుకుని చూసుకున్న నా మొదటి కోడలి బిడ్డ కన్నీళ్ళు పెట్టుకుంటోందిరా. ఓ పదివేలు సర్దండి. మీ నాన్న కిచ్చామనుకోండిరా!' అని ప్రాధేయపడదా మనుకుంటే! ఎంతాశ్చర్యం! వాళ్ళని కన్నప్పుడు తననుకున్నాడా?

ముందు ముందు....చాలా ముందు ఓరోజు 'నాకిది కావాలిరా' అని వాళ్ళని అడగాల్సిన ఓరోజు తన కెదురుపడుతుందని!

ఎంత పిచ్చి!

ఆ రోజు అన్నీ తనవే అనుకున్నాడు.

బిడ్డలంతా తన సొంతం అనుకున్నాడు.

బిడ్డలది, తనదీ ఒకే కుటుంబం అనుకున్నాడు.

రూపాయి బిళ్ళ అందరిదీ అనుకున్నాడు.

అమ్మా, నాన్నా ఒకరి తరువాత ఒకరు పరమపదించినప్పుడు ఒకరకంగా తనకు జ్ఞానోదయం అయింది.

వాళ్ళు పండుముసలివాళ్ళే కావచ్చు. కానీ వాళ్ళ నిండు ప్రేమ తనకుండేది.

తను వాళ్ళకు వార్ధక్యంలో ఇచ్చింది పావలా మందులే కావచ్చు. వాళ్ళు చూపింది కొండంత కృతజ్ఞత.

నిజానికి చూపవలసిన అవసరమేలేని కృతజ్ఞత!

తనకూ నలుగురు కొడుకులు. ఒక్కడంటే ఒక్కడు 'నాన్నా! ఇది నువ్వు నాకు చేశావు నాన్నా' అనలేదు.

'ఇది నాకు చెయ్యలేదు నాన్నా' అన్నవాళ్ళే అందరూ.

తనిచ్చిన రూపాయిలోంచి పావలా ఇవ్వడానికి ఇష్టపడని కొడుకులు వీళ్ళు.

కానీ వీళ్ళకొరకు తన ప్రాణాల్ని ఖర్చుచేయడానికికూడా సందేహించలేదు తనేనాడూ. ఈనాడైతేమటుకు సందేహిస్తాడా?

చిన్నాడికి జబ్బుచేసినప్పుడు యముడనేవాడే ఉంటే 'ఈ ఇంట్లో నుంచి ఒక్క ప్రాణం కావాలి, నీ దిస్తావా? నీ కొడుకుదిస్తావా?' అని అడిగుంటే జంటగా తామిద్దరం ఎదురొచ్చి 'మా ఇద్దర్నీ తీసుకో, మా కన్నబిడ్డని ఈ భూమ్మీద మిగలనీ' అనేవాళ్ళు.

కానీ ఇప్పుడు?

తరాలు మారాయా? జీవిత విలువలు మారాయా? లేక అవసరాలు వాడినలా బంధిస్తున్నాయా? ఎందుకలా ప్రవర్తిస్తున్నాడు పార్థుడు.

వాడు తనకు తండ్రికాదు కన్న కొడుకని తెలిసీ నిన్న వెళ్ళి ఉండబట్టలేక అన్నాడు 'ఇదన్యాయం పార్థూ!" అని.

"ఏది అన్యాయమో, ఏది న్యాయమో నాకు తెలుసు. నువ్వు మాట్లాడక వెళ్ళి పడుకో" అన్నాడు వాడు.

వాడు తన కన్నబిడ్డ. తన భార్య పంచిన రక్తం! మొదట అవమానమనిపించింది కానీ మరుక్షణంలో మరిచిపోయాడు.

'పాపం వాడికెన్ని బాధలో!'

"తాతయ్యా!" కన్నీళ్ళు ఆరిపోయాక ఎండిపోయిన గొంతులోంచి వెలువడిన అక్షరత్రయం అది.

"లే పాపా! వెళ్ళి మరోసారి అడిగిచూడు."

ఒకప్రక్క ఆభిజాత్యం, మరోప్రక్క అవసరం. ఆమె మళ్ళీ తండ్రి దగ్గరికి నడిచింది.

అతను నిదానంగా కళ్ళెత్తి కూతురివైపు చూశాడు జాలిగా, కోపంగా, విసుగ్గా, ప్రేమగా, నిస్సహాయంగా, విరక్తిగా, విభిన్నభావ మిశ్రమంగా!

"కూర్చో శ్వేతా!"

ఆమె నోరు విప్పబోయింది.

తను చిన్నప్పుడు పదేపదే ప్రీతిగా ముద్దాడిన ఆ పెదాలు విప్పి ఆమె ఏమి అడగబోతోందో తనకి తెలుసు.

అందుకే ఆమె నోట్లోనుండి శబ్దతరంగాలు రాకముందే అతడు నోరు విప్పాడు.

"నా పరిస్థితి నువ్వూ అర్థం చేసుకో శ్వేతా! నీవైపు నుండే నువ్వు ఆలోచిస్తే ఎలా?"

ఆమె ఈ వ్యతిరేకతకు కొన్ని నిముషాలు మాట్లాడలేకపోయింది.

"నాన్నా! ఒకవేళ.... ఒకవేళ నాకు మరో అయిదారేళ్ళు పెళ్ళి కాకుండా ఉంటే ఇంకో పదివేలు పెచ్చు కట్నం ఇచ్చేవాళ్ళు కదా! అలా ఇచ్చాననుకో నాన్నా"

అతను పది సంవత్సరాలు వెనక్కు వెళ్ళాడు

అనాటి తన మనః స్థితిలోకి జారుకున్నాడు.

నిజమా! ఇంకో పదివేలు ఇవ్వవలసి వచ్చుంటే తను ఇచ్చేవాడా? ఆ.... ఆ.... ఇచ్చుండేవాడు. పదేళ్ళ క్రితం అనాటి మానసిక దృఢత్వం, శరీరంలో పుష్కలంగా ఉన్న శక్తి అప్పులవాళ్ళు దగ్గర మిగిలిన పరపతి, శ్వేత నాది, నా మనిషి నేను తీర్చవలసిన బాధ్యత ఇదీ అనే భావం, అన్నింటికీ మించి మానసిక శక్తిని పెంచుతూ పక్కన తన భార్య, ఇవన్నీ కలిసి తనకి అండగా కొండంత బలంగా....!

కానీ ఇవన్నీ ఇప్పుడెక్కడివి?

గతించిపోయిన అర్ధాంగి సగంశక్తిని తనతో తీసుకెళ్ళిపోయింది. ఒంటరిగా జీవితంతో పోరాడుతూ, కూతుళ్ళ కోరికలు తీరుస్తూ, అప్పులు చేసి కొడుకులకు చదువులు చెప్పిస్తూ, అప్పులు తీర్చలేని అసమర్థతలో ఈతకొడుతూ తమకొరకే తండ్రి అప్పులు చేశాడనే ఇంగితజ్ఞానం లేకుండా రెక్కలు పెంచుకొని ఎగిరిపోయిన కొడుకులను క్షమిస్తూ, విరక్తితో వాలిపోతూ జీవనాస్తమయ దశలో జ్ఞానోదయాన్ని సంతరించుకుని ఆఖరికొడుకు పెళ్ళి చేసుకొని నాన్నా! వెళ్ళిపోతున్నానని భార్య

భుజంమీద చెయ్యివేసి వెళ్ళిపోకముందే అప్పులన్నీ తీర్చేసి నిశ్చింతగా శేష జీవితం గడుపుదామంటే-శ్వేత కన్నీళ్ళు పెట్టుకుని సమకూర్చుకున్న తన కఠినత్వాన్ని కరిగిస్తోంది.

ఎలా? ఎలా? ఎలా?

శోషవచ్చిన వాడిలా బల్లమీదకు వాలిపోయాడతను.

తండ్రి తలమీద చెయ్యి వేయాలనిపించిందామెకు.

కానీ వేయలేకపోయింది.

ఎంత ప్రకటనా దౌర్భాగ్యం!

పరిస్థితుల ప్రభావం ఎంత బలమైంది!

మధూ! మధూ! నువ్వన్నదే నిజం నాన్నా! అని పిల్లలడగ్గానే కరిగిపోయి ఉండకపోవలసిందే నేను. నిన్ను కాదంటూ, నన్ను నేను కరిగించుకుంటూ, చావులోకూడా నీకు మనశ్శాంతి మిగల్చకుండా వాళ్ళ కోరికలు అలా తీర్చి తీర్చి ఈనాడు నా శక్తికి మించిపోయి కాదంటే చూశావా శ్వేతా ఎలా అవమానపడి కన్నీళ్ళు పెట్టుకుంటుందో!

నువ్వన్నట్టు ఆనాడే నా గుండెను కాస్త కఠినం చేసుకొనుంటే నిరాశ కలవాటుపడ్డ శ్వేత కళ్ళలో ఈనాడు కన్నీళ్ళుండేవి కావు.

ఒక్కక్షణం బ్రతికిరా మధూ! ఇప్పుడు నన్నేమి చేయమంటావో చెపుదువుగాని. ఈసారి నీ మాట కాదనను. ప్లీజ్ మధూ ప్లీజ్!

"నాన్నా!" తన భుజంమీద చేతి స్పర్శ- ఈ చెయ్యి మధూదైతే ఎంత బాగుంటుంది!

కానీ ఇది జీవితం.

మధు బ్రతికిరాదు.

ఆ చెయ్యి ఎంత కష్టంలోనయినా సేదతీర్చే మధు చెయ్యికాదు.

"నాన్నా! నా కోర్కె తీర్చవూ?" అనే తన మొదటి సంతానం చెయ్యి అది.

నీరసంగా లేచాడతను.

"నాన్నా! బాధ పెడ్తున్నానా?"

చిన్నగా నవ్వాడు, విరక్తిగా చూశాడు. ఏం పిల్లలు! బాధపెడుతున్నానా నాన్నా! అందే కాని వద్దులే నాన్నా మీ ఇష్ట ప్రకారమే కానివ్వండి అందా? అతని అణువణువునా విరక్తి. ఏం పిల్లలు వీళ్ళు! వీళ్ళ కొరకు ఎంత తపనపడ్డారు తాము! క్యాడ్‌బరీ తెచ్చిస్తే సంబరంగా లాక్కుని నాలుగు ముక్కలు నలుగురూ తిని 'అయ్యో! నాన్నా నీకు పెట్టలేదు అంటే 'నా కెందుకురా మీరు తినండి....మీరు మీ కిష్టమయిన ఖరీదయిన క్యాడ్‌బరీని అరుదుగా తిని ఆనందిస్తుంటే ఆ ఆనందాన్ని నేను తింటాను' అనుకునేవాడు.

తను రెక్కలు ముక్కలు చేసుకుని సంపాయించి పండగలకు బట్టలు తెస్తే "మీకేవీ?" అని మధు మాత్రం చిన్నబుచ్చుకునేది. తను కొత్త బట్టలు తెచ్చుకోలేదనే స్పృహే పిల్లలకుండేది కాదు. అలా అని తను చిన్నబుచ్చుకునేవాడా? పసిపిల్లలు వాళ్ళకేం తెలుస్తుంది? అనుకునే వాడు.

అందంగా అలంకరించుకుని వాళ్ళు పండగపూట ఇల్లంతా బొంగరంలా తిరుగుతుంటే కళ్ళింతింత చేసుకుని చూసి తృప్తి పడేవాళ్ళు తామిద్దరూ.

ఏ ఒక్కరోజయినా తామిద్దరూ 'ఈ సంపాదన నాది ఇది నాకు' అనుకోనుండుంటే ఈ పిల్లలు ఇంత వాళ్ళయి వుండేవారా?

అసలు....అసలు పిల్లలకు మంచి జీవిత భాగస్వామిని వెతికి పెట్టాలనీ, మంచి భవిష్యత్తివ్వాలనీ కాళ్ళు అరిగేలా, మనసు నలిగేలా ఎందుకు దాపత్రయపడుతున్నారు తంత్రులు?

అలా జీవితాన్ని మలచిన పిల్లల దగ్గరనుంచి ఏం పొందుతున్నారని?

ఇంత సానుభూతి, ఇంత ఆదరణ చాలు చాలు! అవి చాలు పొంగిపోవడానికి, తృప్తిపడడానికి.

కానీ—ఏవీ—అవేవీ? అతని గుండెలోనుంచి కంట్లోకి, కంట్లోనుండి చెంపలమీదకూ జారిపోతూ కన్నీరు!

ఊహ బాగా తెలిశాక జీవితంలో అతను కన్నీరు కార్చడం ఇది నాలుగోసారి.

మొదటిసారి తల్లి చనిపోయినప్పుడు. రెండోసారి శ్వేత పరాయిదై అత్తగారింటి కెళ్ళిన రోజు.

మూడోసారి భార్య తనని ఒంటరివాడ్ని చేసి శాశ్వతంగా వెళ్ళిన రోజు.

ఇప్పుడు....ఇప్పుడు మరోసారి ఎందుకేడుస్తున్నాడు? వాళ్ళను తాహతుకి మించి పెంచి ప్రయోజకుల్ని చేసినందుకు పశ్చాత్తాపంతో కాదు.

తనీ నాడు నిరుపేదగా మిగిలిపోయినందుకు కాదు! అయితే—ఎందుకు? ఎందుకు? అతని ప్రశ్నకు జవాబు దొరక్క....! తను గుండె మీదకాదు. గుండెలో పెట్టుకుని పెంచుకున్న కూతురు. ఈ ముసలి తండ్రి సమస్యను అర్థం చేసుకోదేం?

ఈ పేద తండ్రి కోరిక ఒకేఒక్క కోరికను మన్నించదేం? ఈ కన్న తండ్రి మనోవేదనకు సానుభూతి చూపదేం?

"నాన్నా!"

అతను తలెత్తాడు.

చెంపల మీద కన్నీరు జారిపోతుండగా తలెత్తాడు. తండ్రి కన్నీరు చూసి శ్వేత తప్పుచేసిన దానిలా తల దించుకుంది.

తన కూతురి కళ్ళలో పశ్చాత్తాపభావం అతను అర్థంచేసుకున్నాడు బాధపడ్డాడు.

"పోనీ! పోనీ! ఇంకేం తీర్చబోతాడు? పోనీ శ్వేత కోరికే తీరనీ!"

కానీ, తను ఆఖరి శ్వాస తీయబోయే ముందు వరకు అప్పుల వాళ్ళు తన మీద నమ్మకంతో ఆగుతారు. తనకు తెలుసు. కానీ ఆక్షణములో నా అప్పు తీర్చకుండా వెళుతున్నావు కదూ!" అనే చూపు చూస్తే తనెలా భరించడం?

ఇదిగో మీ అప్పులకు నా ఆఖరి కొడుకుని బాధ్యుడ్ని చేస్తున్నానని చెప్పగలిగే సాహసం చేద్దామంటే ఆ నమ్మకాన్ని కొడుకులు నిలుపుకోలేదు.

'నాన్నా నువ్వు చేసిన ప్రతి అప్పూ తమ్ముడు తీర్చేలా నేను హామీ ఇస్తున్నాను నాన్నా!" అంటుంది ఇంకా ఎదగవలసిన శ్వేత.

ఏ మనిషి జ్ఞానోదయమూ మరో మనిషికి జ్ఞానాన్నివ్వదు. ఎవరి జీవిత పాఠాలతో వాళ్ళు జ్ఞానం పొందవలసిందే!

అమాయకురాలు, ఇంకా తన తమ్ముడు తన మాట వింటాడనే అనుకుంటోంది.

"నాన్నా! నువ్వు కాదంటే మానసకి పెళ్ళే కాదు నాన్నా వాళ్ళ నాన్న ఎంత అసమర్థుడో నీకు తెలియందేముంది?"

అతని మానసిక శక్తి సన్నగిల్లుతోంది.

"చిన్నప్పటినుండి నీ ఒళ్ళో పెరిగిన పిల్ల కట్నమిచ్చి పెళ్ళి చేయలేని వాళ్ళం. కట్నం ఇవ్వందే ఆడపిల్లకు పెళ్ళికాని రోజులు.... నాన్నా నువ్వు మంచి మనసు చేసుకుని కట్నం లేకుండా మానసను నీ ఒళ్ళో వేసుకో నాన్నా!"

అతను దీర్ఘంగా కూతురువైపు చూశాడు.

"శ్వేతా! నీకూ తెలుసు, నాకు కొడుకులను అమ్ముకోవడం ఇష్టంలేదని. అందుకే— అందుకే నీ పెద్ద తమ్ముడికి కట్నం లేకుండా పెద్ద కోడలిని తెచ్చుకున్నాను. మనింటి కొచ్చే అమ్మాయి మనకి జీవితాంతం జీతం లేకుండా సేవలు చేయడానికొచ్చే అమ్మాయి—తనతో పాటు డబ్బు మూట తేవాలని— అంటే: ఆ అమ్మాయి ఖర్చులు ఆ అమ్మాయి తల్లితండ్రులే భరించాలనే దురాచారాన్ని ఖండించాను. కానీ నీ తమ్ముడేమన్నాడో తెలుసామ్మా! 'అప్పులున్నాయి నాన్నా! కాస్త డబ్బు సర్దరా' అంటే విన్నావుగామ్మా, ఆ రోజు నువ్వూ విన్నావుగా. కట్నం తీసుకోకుండా నా కెవరు పెళ్ళిచేయమన్నారు?' అన్నాడు. నీ రెండో తమ్ముడు అదే వేణు. వాడు— వాడు...." మానసికంగా విపరీతంగా అలిసిపోయిన అతను ఆయాసంతో మాట పూర్తిచేయలేక పోయాడు.

"నాన్నా!" తండ్రి కేదో భరోసా ఇవ్వబోయింది శ్వేత.

"ఆగమ్మా నన్ను మాట్లాడనీ శ్వేతా! నేనెందుకిలా నీ మనస్సు నొప్పిస్తున్నానో నీ కర్థమవుతుంది. నన్ను పూర్తిగా చెప్పనీమ్మా!"

తండ్రి దగ్గర నుండి ఇవన్నీ వినాలనిలేదు శ్వేతకు.

త్వరగా తన సమస్య తేలిపోతే బాగుంటుందని వుంది. అందుకే అయిష్టంగా చెప్పమన్నట్టు చూసింది.

"నీ రెండో తమ్ముడు ఒక రోజు వచ్చి నాన్నా నేను ఓ అమ్మాయిని ప్రేమించాను. ఆ అమ్మాయినే చేసుకుంటాను అంటే నేను ఇష్టపడిన అమ్మాయికంటే జీవితాంతం కలిసి కాపురం చెయ్యవలసిన వాడు ఇష్టపడిన అమ్మాయిని చేయడమే మంచిదని సంతోషంగా ఒప్పుకున్నాను. కట్నం తీసుకోవడం నా కిష్టం లేదు నాన్నా అంటే అది వాడి ఆదర్శమో లేక తను ఇష్టపడిన అమ్మాయి కట్నం ఇవ్వలేదనో,

అర్థం కాని దశలో ఏది ఏమైనా నా కొడుకు ఓ మంచిపని చేస్తున్నాడనే గుండె నిండిన గర్వంతో పెళ్ళి చేశాను. కానీ వాడేంచేశాడమ్మా. రిటైర్ అయిపోయిన తండ్రి తీసుకున్న ప్రావిడెంట్ ఫండ్ కూడా అయిపోయిందని తెలిసీ, రోగిష్టి మనిషినని తెలిసీ అప్పులతో తనకు సంబంధంలేదని నిశ్శబ్దంగా చెప్పి భార్యను తీసుని వెళ్ళిపోయాడు కదమ్మా! ఇప్పుడు నన్నీ అప్పులు ఎలా తీర్చమంటావో చెప్పమ్మా శ్వేతా!" అతని కంఠం పూడుకున్నట్టయింది.

"నాన్నా! మానస చిన్నపిల్లే కానీ నాకు తెలుసు నాన్నా, మానస తన భర్తనలా చేయనీయదు. నీ బాధనర్థం చేసుకుంటుంది.

అతను మనసులోనే నవ్వుకున్నాడు.

"నువ్వే నా బాధ నర్థం చేసుకోలేదు. నీ కూతురు నా బాధనర్థం చేసుకుంటుందని ఎలా నమ్మనమ్మా!"

తన మనసులో రేగిన ఈ అపనమ్మకాన్ని అతను బయట పెట్టలేదు. పదిహేడేళ్ళ క్రితం తను శ్వేతకు పెళ్ళిచేయడానికి తాపత్రయపడిన దశలో ఇప్పుడు శ్వేత వుంది. దాన్ని స్వార్థమనాలో, త్యాగమనాలో తెలియదు. శ్వేత తండ్రిని అర్థం చేసుకునే దశలో ఇప్పుడు లేదు. ఇక బయటపడి ప్రయోజనమేమిటి?

"నాన్నా! ఇక మరో ఆలోచన పెట్టుకోకు నాన్నా"

అతను కూతురువైపు నిస్సహాయంగా చూశాడు.

"శ్వేతా! పీటలమీద నా ప్రక్కన కూర్చుని మీ ఇద్దరికీ కన్యాదానం చేసేవరకే బ్రతికి నన్నిలా ఒంటరివాణ్ణి చేసి వెళ్ళిపోయిందమ్మా మీ అమ్మ. ఆమే బ్రతికుంటే నీ తమ్ముళ్ళ పెళ్ళిళ్ళ విషయములో నాకేమి సలహా ఇచ్చేదో...." గొణిగినట్టుగా అని ఇక నిల్చోనట్టు మళ్ళీ అదే కుర్చీలో కూలబడిపోయాడతను.

"నాన్నా అమ్మే బ్రతికివుంటే నా కోరిక ఏది కాదన్నా దీన్ని కాదంటుందా నాన్నా? మానసను అనాధగా చేస్తావా నాన్నా?"

ఆమె కంఠంలో ఆర్ద్రతకు కరిగిపోతున్నాడు కరిగి ప్రవహిస్తు న్నాడు.

"తల్లీ! ఏమాత్రం నాకు ఆధారమున్నా అప్పులు తీరేమార్గం నా కింకే విధంగా వున్నా నా చిన్నకొడుకును అమ్ముకొనే హీనస్థితికి దిగ జారుండేవాడిని కాదమ్మా! నేను చాలా పొరపాటు చేశానమ్మా. నా బిడ్డల్ని ఎంతో ఎత్తులో ఉంచాలనే దురాశతో నా శక్తికిమించి ఖర్చులు చేసి అప్పులపాలయ్యాను. ఇప్పుడు వాటిని వాళ్ళు తీర్చలేదని ఏడవ టంలో అర్థముందా?"

"శ్వేతా! నువ్వు ఇక్కడకొచ్చి నీ కూతుర్ని నా కొడుక్కి అడి గిన రోజునుంచీ నేను నిద్రపోలేదంటే నమ్ముతావా? రాత్రి పగలూ అల్లాడిపోతున్నాను శ్వేతా! రోజులో ముప్పాతికభాగం ప్రయివేట్లు చెప్పినా, అకౌంట్స్ రాసినా నేను పాతికవేలకు వడ్డీ అయినా సంపా దించగలనా? నాకొచ్చే పించను నా తిండికీ, నా మందులకూ చాలడం లేనిరోజుల్లో.... చెప్పమ్మా?"

"వద్దునాన్నా! నువ్వు తీర్చద్దు. ఆ అప్పులన్నీ మానస, మహేష్ తీర్చుకుంటారు నాన్నా. నీ వాకిటముందు కొంగుచాచి బిచ్చమడుగు తున్నాననుకో నాన్నా! ఇక ఏ అడ్డమూ చెప్పకు నాన్నా!మానసను అనా ధను చేయకు నాన్నా" ఆమె గుండె పగిలినట్లు ఏడ్చేసింది.

అతను పూర్తిగా కరిగిపోయాడు.

లేచి నిల్చున్నాడు.

గుండేలో మరో కొవ్వొత్తి వెలిగించుకోడానికి సిద్ధపడ్డాడు.

"అలాగే.... అలాగే ఏడవకమ్మా శ్వేతా, కళ్ళు తుడుచుకో."

ఆమె గుండెలో ముత్యాలజల్లు. తన తండ్రినీ, ఈ ప్రపంచాన్ని గిరగిరా తిప్పేయాలన్నంత ఆనందం.

ఆ ఆనందం తన కోరిక తీరినందుకే కాదు, ముఖ్యంగా తనపట్ల తండ్రి ఇన్నాళ్ళుగా సంతరించుకున్న కాఠిన్యం కరిగిపోయినందుకు. చిన్నప్పటిలా కళ్ళు తుడుచుకుని తండ్రి ఒడిలో వాలిపోలేదు కానీ చిన్న పిల్లలా వెనక్కు పరిగెట్టింది శ్వేత.

"తాతయ్యా! నాన్న...."

అతను నవ్వాడు. బోసినోరు తెరిచి నవ్వాడు.

"అతను తండ్రి శ్వేతా! బిడ్డకాదమ్మా!"

❋